సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



రాజన్న ఆదాయం రూ.1.63 కోట్లు

వేములవాడ: రాజన్న హుండీ ద్వారా రూ.1.63 కోట్ల నగదు, 170.350 గ్రాముల బంగారం, 13.300కిలోల వెండి సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు.



ధర్మగుండానికి మరో మార్గం

వేములవాడ: రాజన్న ఆలయ ధర్మగుండంలోకి భక్తులు వచ్చేందుకు గుడిచెరువు ఖాళీ స్థలం నుంచి కొత్తగా రోడ్డు వేశారు. ఈ మార్గాన్ని బుధవారం ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం
32.0/17.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.




రాజన్నకు 50 కోట్లు.. అంజన్నకు 100 కోట్లు..

- బడ్జెట్‌లో రెండు ప్రధాన ఆలయాలకు నిధుల కేటాయింపు
- నాంపల్లి గుట్టపై త్వరలో రోప్‌వే ఏర్పాటు
- కోటిలింగాల, గోదావరిఖని, ఎల్‌ఎండీలలో మరిన్ని పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని కొండగట్టు అంజన్న, వేములవాడ రాజన్న ఆలయాలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం దక్కినట్లయ్యింది. మొన్న రాజన్న ఆలయానికి రూ.50 కోట్లు కేటాయించిన సర్కారు.. తాజాగా కొండగట్టుకు రూ.100 కోట్లు ప్రకటించింది. దీంతో ఆలయాల అభివృద్ధికి ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్న ఘడియలు వచ్చినట్లయ్యింది.

ఎములాడ జంక్షన్ల సుందరీకరణ..

రాజన్న గుడి అభివృద్ధిపై సీఎం కేసీఆర్ 18 జూన్ 2015న స్వయంగా గుడి, పట్టణం కలియ తిరిగారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఇందుకు ఏటా రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని ప్రకటించారు.

- ముందుగా రూ.71 కోట్లు మంజూరు చేశారు. అనంతరం వీటీడీఏ ఏర్పాటు చేసి కమిటీనీ ప్రకటించారు. చైర్మన్‌గా సీఎం కేసీఆర్, వైస్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పురుషోత్తంరెడ్డిని నియమించారు. నిధులను వీటీడీఏ ద్వారానే ఖర్చు చేయాలని జీవో విడుదల చేశారు.
- ఆ మేరకు ఆలయ అధికారులు రూ.410 కోట్లతో భక్తుల సౌకర్యాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. గతేడాది, ఈసారి బడ్జెట్‌లో రూ.50 కోట్ల చొప్పున కేటాయించారు.
- తాజా నిధులతో బద్దిపోచమ్మ గుడి వద్ద సేకరించిన భూమికి ప్రహరీ, బోనాల మంటపం నిర్మిస్తామని వీటీడీఏ వైస్ చైర్మన్ వెల్లడించారు. నగరమంతా ఫుట్‌పాత్‌ల నిర్మాణం, గుడి ట్యాంక్‌బండ్‌పై వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ పనులు చేపడతామని, నందికమాన్ నుంచి వేములవాడకు చేరుకునే రోడ్డు సుందరీకరణ, జంక్షన్లు అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

కాళేశ్వరం టూరిజం సర్క్యూట్



రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక కాళేశ్వరం.. దాని అనుబంధ ప్రాజెక్టుల వద్ద పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ పేరిట బడ్జెట్‌లో రూ.750 కోట్లు కేటాయించింది. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ, గోదావరిఖని వంతెన, కోటిలింగాల బ్యాక్ వాటర్, లోయర్, మధ్య, ఎగువ మానేరు డ్యామ్‌ల వద్ద పర్యాటక అభివృద్ధికి ఈ నిధులు వెచ్చించనున్నారు. అయితే ఉమ్మడి జిల్లాను పర్యాటక క్షేత్రంగా మలచాలన్న ప్రభుత్వ లక్ష్యం ఎప్పటిలోగా నెరవేరుతుందోనన్న విషయం ఆసక్తికరంగా మారింది.

నాంపల్లి గుట్టకు రోప్‌వే



వేములవాడను తీర్చిదిద్దే క్రమంలో మంత్రి కేటీఆర్ సూచనల మేరకు నాంపల్లిగుట్టపై రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం జరగనుంది. వేములవాడకు వచ్చే కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వే ట్రాక్ నాంపల్లి గుట్టను ఆనుకుంటూ వెళ్లనుంది. దీంతో హైదరాబాద్, మేడ్చల్, గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నుంచి వచ్చే భక్తులకు ఆహ్లాదకరంగా ఉండేలా ఇక్కడి పరిసరాలను తీర్చిదిద్దనున్నారు. ఈ పనులపై కేటీఆర్ ఇప్పటికే సమీక్షించారు కూడా.

కొండగట్టుకు మాస్టర్‌ప్లాన్..

కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి బడ్జెట్‌లో రూ.100 కోట్లు మంజూరు చేశారు. గత డిసెంబరు 7న జగిత్యాల సభలో స్వామివారికి రూ.100 కోట్లు ఇస్తామన్న సీఎం.. సరిగ్గా 50 రోజులకు తన మాట నిలబెట్టుకున్నారు. రానున్న 50 ఏళ్లలో భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాల్సి ఉందని, ప్రత్యేక ప్రణాళికతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు.

న్యూస్‌రీల్

డిగ్రీ కళాశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న కదారి సురేందర్‌రెడ్డి

వేములవాడఅర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను బలోపేతం చేయాలని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కదారి సురేందర్‌రెడ్డి కోరారు. వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం(టీజీసీజీటీఏ) సమావేశం బుధవారం నిర్వహించారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులతోపాటు అర్హత గల అధ్యాపకులతో నాణ్యమైన విద్య బోధన చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో ప్రవేశాలను మరింతగా పెంచేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా టీజీసీజీటీఏ అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజేశ్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బీడీకార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: బీడీ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల మంది బీడీ కార్మికులకు జీవనభృతి కింద రూ.2 వేలు అందిస్తామని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించారన్నారు. జిల్లాలో రూ.80 వేల మంది బీడీ కార్మికులు ఉన్నారని ఇంటికి ఒకటే పింఛన్ విధానంతో వీరు ప్రభుత్వ సాయానికి దూరంగా ఉంటున్నారని, వీరి సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోర అజయ్, నాయకులు సూరం పద్మ, సామల కవిత పాల్గొన్నారు.

జీవనోపాధికి కుట్టుశిక్షణ



మాట్లాడుతున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట: జీవనోపాధికి కుట్టు శిక్షణ దోహదపడుతుందని, మహిళలు ఈ కుట్టుశిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. మండలంలోని దమ్మన్నపేటలో నాబార్డు సహకారంతో వాటర్‌షెడ్ పథకం కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుశిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ మహిళలు స్వయం ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. నాబార్డు ఏజీఎం మనోహర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం సుదర్శన్, కేడీసీసీబీ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు లక్ష్మి, బాల్యానాయక్, ఎంపీటీసీ కవిత పాల్గొన్నారు.

'ఈ–శ్రమ్'ను సద్వినియోగం చేసుకోవాలి



ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో 'ఈ–శ్రమ్'పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్‌లను విడుదల చేశారు. జిల్లా కార్మికశాఖ అధికారి రఫీ మాట్లాడుతూ.. 16 నుంచి 59 ఏళ్ల వయస్సు గల అసంఘటిత కార్మికులు ఈ–శ్రమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసంఘటిత కార్మికులు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దీని ద్వారా రూ.2లక్షల ప్రమాద బీమా, రూ.లక్ష అంగవైకల్య బీమా వర్తిస్తుందని తెలిపారు. ఎంపీపీ వంగ కరుణ, సర్పంచ్ అక్కపల్లి స్వరూప, నాయకులు సురేందర్‌రెడ్డి, రాజనర్సింహారెడ్డి, నర్సింలు, బాల్‌రెడ్డి, రాజనర్సు పాల్గొన్నారు.

భార్య కోసం వెళ్లిన భర్త దారుణ హత్య

- భార్య అమ్మమ్మ ఇంట్లో కిరాతకం
- నర్సింగాపూర్‌లో హత్య.. రుద్రంగిలో విషాదం
- విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తాం : డీఎస్పీ



గణేశ్(ఫైల్)

చందుర్తి(వేములవాడ): భార్య జాడ కోసం వెళ్లిన భర్త దారుణహత్యకు గురైన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని నర్సింగాపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. రుద్రంగికి చెందిన రణవేణి గణేశ్(27), వేములవాడరూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన సింగరవేణి స్వప్న రెండున్నరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గణేశ్ గ్రామంలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. 18 నెలల పాటు అన్యోన్యంగా ఉన్న జంటకు ఏడాదిగా కాపురంలో కలహాలు ప్రారంభమయ్యాయి. గత 15 రోజుల క్రితం భర్త గణేశ్ భార్యపై చెయ్యి చేసుకోవడంతోపాటు విద్యుత్‌షాక్ పెట్టాడు. దీంతో స్వప్న తప్పించుకుని వట్టెంల గ్రామంలోని తల్లిగారింటికి వెళ్లింది. భర్త గణేశ్‌పై వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇద్దామనే క్రమంలో స్వప్న పోలీస్‌స్టేషన్‌కు రాకపోవడంతో వాయిదాపడింది. నాలుగు రోజుల క్రితం భార్య కోసం అత్తగారింటికి, ఇల్లంతకుంట మండలం వంతడుపులలోని భార్య అక్క ఇంటికెళ్లి వాకబు చేశారు. అక్కడ స్వప్న లేకపోవడంతో రుద్రంగికి తిరిగొచ్చాడు. తన ఆచూకీ కోసం భర్త తిరుగుతున్నాడని తెలుసుకున్న స్వప్న చందుర్తి మండలం నర్సింగపూర్‌లోని అమ్మమ్మ గారింట్లో తలదాచుకుంటోంది. ఈ విషయం తెలుసుకున్న గణేశ్ మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో రుద్రంగి నుంచి బయలుదేరి వెళ్లాడు. గణేశ్ రాకను గమనించిన ఇంట్లో ఉన్న మహిళలే కంట్లో కారం చల్లి గొడ్డలితో దాడి చేశారని డీఎస్పీ నాగేంద్రాచారి తెలిపారు. హత్యలో ఎవరి ప్రమేయం ఎంత ఉందనే వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని వివరించారు. సంఘటన స్థలాన్ని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమేశ్ పరిశీలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

హత్య చేస్తాడని.. భయపడే హతమార్చారా?

వారం రోజులుగా భార్య ఆచూకీ కోసం తిరుగుతున్న గణేశ్ ఆవేశంతో ఉన్నాడని భార్య తరఫున బంధువులు భావించారు. తమను ఎక్కడ హత్య చేస్తారనే ముందస్తుగానే హతమార్చారా.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. మృతుడి తండ్రి చంద్రయ్య ఆరోపణలతో గతంలో శతృత్వం ఉన్న రుద్రంగికి చెందిన వ్యక్తి గణేశ్‌ను హత్య చేశాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. అక్రమ సంబంధమే హత్యకు కారణమని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి మాట్లాడుతూ ప్రాథమిక విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

హత్య చేసి.. 100కు డయల్ చేసి

నర్సింగాపూర్‌లో గణేశ్ హత్య జరిగిన విషయం 100కు డయల్ చేసి చెప్పడంతోనే చందుర్తి పోలీసులకు తెలిసింది. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో డయల్ 100కు సమాచారం రావడంతో వెంటనే చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట ఎస్సైలు రమేశ్, ప్రభాకర్, రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గణేశ్ మృతిచెంది ఉన్నాడు. తెల్లవారేసరికి గ్రామంలో పోలీస్ వాహనాలు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. గ్రామంలో హత్య జరిగినట్లు తెలియడంతో ఉలిక్కిపడ్డారు.

42 రోజులు.. 3 హత్యలు

కారణాలు ఏవైనా క్షణికావేశానికి లోనవుతున్నారు. హత్యలకు పాల్పడుతూ కటకటాల పాలవుతున్నారు. రెండు వైపులా కుటుంబాలు రోడ్డు మీద పడుతున్నాయి. చందుర్తి మండలంలో గత 42 రోజులలో మూడు హత్యలు జరగడం స్థానికులను భయాందోళనకు గురిచేస్తుంది. చందుర్తి మండలంలోని జోగాపూర్‌లో గత జనవరి 21వ తేదీ రాత్రి సమయంలో గొల్లపల్లి శంకర్ ఉరఫ్ మర్డర్ శంకరయ్య హత్యకు గురయ్యాడు. గతంలో శంకర్ ఓ హత్యలో నిందితుడు. జోగాపూర్‌కు చెందిన గొల్లపల్లి లింగవ్వను 2022, డిసెంబర్ 26వ తేదీన శంకర్ హత్య చేశాడు. తన తల్లిని చంపాడనే కోపంతో శంకర్‌ను లింగవ్వ కుమారుడు మధుసాతర్ మరో ముగ్గురితో కలిసి హత్యకు పాల్పడ్డాడు. ఈ రెండు హత్యలతో మూడు కుటుంబాలు చిన్నాభిన్నామయ్యాయి. పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని జరిగినవే ఈ హత్యలు. హత్య చేసిన వారు జైలుపాలు కాగా.. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ సంఘటనలను మరిచిపోయేలోపే నర్సింగాపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి హత్య జరగడం పోలీసులను కలవరానికి గురిచేస్తుంది.

నర్సింగాపూర్‌లో హత్య కలకలం

నర్సింగాపూర్‌కు చెందిన మెరుపుల హరీశ్‌ను 2019వ సంవత్సరం జనవరి 8న భూతగాదాన్ని దృష్టిలో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన వ్యక్తి హత్య చేశాడు. 2020, ఆగస్టు 2న బైరగోని తిరుపతిని భూతగాదాల్లో మూడపల్లికి చెందిన వ్యక్తి హతమార్చారు. ఈ రెండు సంఘటనలతో హత్యలకు వేదికగా మారిందని పోలీసులు నిఘా తీవ్రతరం చేసి కట్టడి చేశారు. తాజాగా జరిగిన రుద్రంగి యువకుడు రణవేని గణేశ్ హత్యతో గ్రామం ఉలిక్కిపడింది.

జాతర పనులు పూర్తయ్యేనా?!

- రూ.3.70 కోట్లతో మహాజాతర పనులు
- 14 పనులు పూర్తి
- కొనసాగుతున్న మరో 30 పనులు
- నేడు సమన్వయ కమిటీ సమావేశం



గుడి చెరువు ఖాళీ స్థలంలో చలవ పందిళ్లు

వేములవాడ: మహాశివరాత్రి జాతర మహోత్సవానికి వచ్చే భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వేములవాడ రాజన్న సన్నిధిలో ఈనెల 17 నుంచి మహాశివరాత్రి జాతర మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ అధికారులు రూ.3.70 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రాజేశ్వరపురంలో వాహనపూజ కోసం సిద్ధమవుతున్న భవనం పనులు, ఇటీవల భూసేకరణ చేసిన బద్దిపోచమ్మ ఆలయం వెనుక ప్రాంతంలో చలవపందిళ్లు, గుడి చెరువు ఖాళీ స్థలంలో పార్కింగ్ వద్ద సీసీ రోడ్డు, గుడి చెరువు ఖాళీ స్థలంలో చలవ పందిళ్ల పనులు జరుగుతున్నాయి. పార్కింగ్ స్థలంలో తాత్కాలిక మరుగుదొడ్లు, గుడిచెరువు ఖాళీ స్థలంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు జాతర సమన్వయ కమిటీ సమావేశం

మహాశివరాత్రి జాతర మహోత్సవాల నిర్వహణపై జాతర సమన్వయ కమిటీ గురువారం సమావేశం కానుంది. కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ బుధవారం తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఎస్పీ అఖిల్ మహాజన్, కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పురప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా జాతర ఉత్సవాలపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించగా, ఇటీవల మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

15 వరకు పనులు పూర్తి చేస్తాం



జాతర ఉత్సవాల కోసం రూ.3.70 కోట్లతో చేపట్టిన పనులను ఈనెల 15 వరకు పూర్తి చేస్తాం. ఇప్పటికే 14 పనులు పూర్తి చేశాం. 15 పనులు 70 శాతం వరకు పూర్తయ్యాయి. కొన్ని పనులు మిగిలి ఉన్నాయి. మరికొన్ని పనులు జాతర ఉత్సవాలకు మూడు రోజుల ముందుగానే చేపడతాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తాం.

– రాజేశ్, ఆలయ ఈఈ

మూడు ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు



సిరిసిల్లలోని ఓ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న బృందం

సిరిసిల్లటౌన్: నిబంధనలు పాటించని ప్రైవేటు ఆస్పత్రులకు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ షోకాజ్ నోటీసులు అందించింది. కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాలతో సిరిసిల్లలోని ఆరు ప్రైవేటు ఆస్పత్రుల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీలు చేపట్టింది. ప్రభుత్వ నిబంధనలు పాటించని మూడు ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్‌సెంటర్లు నిబంధనల ప్రకారం నిర్వహించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తనిఖీల్లో కమిటీ సభ్యులు డాక్టర్ సంతోష్, చింతోజు భాస్కర్, జలపతి, బాలయ్య తదితరులు ఉన్నారు.

సీఎమ్మార్ వెంటనే అందించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



రైస్‌మిల్లర్లతో సమీక్షిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లటౌన్: రైస్‌మిల్లర్లు వెంటనే సీఎమ్మార్(కస్టమ్ మిల్లింగ్ రైస్)ను అందించాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా రైస్‌మిల్లర్లతో సమీక్షించారు. 2021–22 సీజన్‌లో 2,67,156 టన్నుల వరిధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు అందిస్తే.. మిల్లర్లు 1,78,996 టన్నులు మాత్రమే చెల్లించారన్నారు. మిగతా 34,446 టన్నుల బియ్యాన్ని ఈనెల 28లోగా అందజేయాలని ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్, రైస్‌మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన సర్కారు

సిరిసిల్లటౌన్: బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా రాష్ట్ర సర్కారు విద్యారంగాన్ని విస్మరించిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై బుధవారం సిరిసిల్లలోని అంబేద్కర్‌చౌరస్తాలో ధర్నా చేపట్టి మాట్లాడారు. అటు కేంద్ర సర్కారు కూడా ప్రభుత్వ విద్యకు మొండిచేయి చూపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి మరిన్ని నిధులు కేటాయించాలని, అన్ని ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలను అరికట్టాలని కోరారు. గుండెల్లి కళ్యాణ్‌కుమార్, జూలపల్లి మనోజ్‌కుమార్, కుర్ర రాకేశ్, సాధిక్, వేణు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

కరీంనగర్: మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఖుస్రో షా ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ శైవ క్షేత్రాలకు సైతం ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈనెల 17,18,19 తేదీల్లో కరీంనగర్ నుంచి 80 బస్సులు, కోరుట్ల నుంచి 60, మెట్‌పల్లి నుంచి 60, జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి 42, కొండగట్టు /జగిత్యాల నుంచి 37, సిరిసిల్ల నుంచి 11, వరంగల్–హుజూరాబాద్ నుంచి 45 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వేములవాడ బస్టాండ్ నుంచి గుడి వరకు 14 మినీ బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం పేర్కొన్నారు.

- వేలాల జాతరకు గోదావరిఖని, మంథని డిపోల నుంచి, కాళేశ్వరానికి మంథని, కరీంనగర్, గోదావరిఖని డిపోల నుంచి రద్దీని బట్టి బస్సులు నడుపుతామని తెలిపారు. జగిత్యాలలోని దుబ్బరాజన్న, హుస్నాబాద్ మండలం పొట్లపల్లి జాతరకు, మంథని నుంచి సిరొంచకు ఆరు బస్సులు భక్తుల రద్దీని బట్టి నడుపుతామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆర్మూర్, నర్సంపేట, వరంగల్, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి నుంచి కూడా వేములవాడ దేవస్థానానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలను తరిమికొట్టాలి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్
- మర్తనపేటలో హాత్‌సే హాత్ జోడో యాత్ర



మర్తనపేటలో ప్రచారం చేస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు తరిమికొట్టాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. మండలంలోని మర్తనపేటలో ఇంటింటికీ హాత్ సే హాత్ జోడో యాత్రను బుధవారం నిర్వహించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రైతు వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో 8 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. విద్యుత్, బస్సు, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకపోగా, నిరుద్యోగభృతి ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో ఏకకాలంలో రుణమాఫీ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం నాలుగు విడతల్లో చేస్తున్నా అది వడ్డీలకు సరిపోవడంలేదన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, జిల్లా, మండల నాయకులు పునీత్, తాళ్లపెల్లి ప్రభాకర్, భాస్కర్‌రావు, శ్రీనివాస్, బోయిని దేవరాజు, ధర్మేందర్, రవిగౌడ్, రామచంద్రం, వెంకన్న, సిద్దార్థ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూడు వాహనాలు సీజ్



వాహన పత్రాలు పరిశీలిస్తున్న ఎస్సై

ముస్తాబాద్(సిరిసిల్ల): నిబంధనలు అతిక్రమించి జరిమానాలు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న మూడు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని నామాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా, వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ, ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపైకి రావద్దన్నారు. ఈ సందర్భంగా పలు వాహనదారులకు జరిమానా విధించారు.

'లగిశెట్టి'ని స్వాగతించిన బీజేపీ కార్యవర్గం



కార్యవర్గం సమావేశంలో లగిశెట్టి శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: బీజేపీలో శుక్రవారం చేరనున్న సెస్ మాజీ వైస్‌చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్‌ను బీజేపీ జిల్లా కార్యవర్గం స్వాగతించింది. బుధవారం పార్టీ కార్యవర్గం సమావేశంలో లగిశెట్టి శ్రీనివాస్‌ను నాయకులు అభినందించారు. బీజేపీ సిరిసిల్ల అసెంబ్లీ పాలక్ రాణిరుద్రమ, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అవునూరి రమాకాంత్‌రావు, ఎర్ర మహేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మల్లికార్జున్, శీలం రాజు పాల్గొన్నారు.

హెల్త్‌స్కీం ప్రకటన హర్షణీయం



చంద్రశేఖర్

వేములవాడ: ఉద్యోగులకు హెల్త్‌స్కీం అమలుచేస్తానని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించడంపై టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్ బుధవారం హర్షం వ్యక్తంచేశారు. సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉద్యోగవిరమణ పొందిన పెన్షనర్ల ఆరోగ్యభద్రతపై సీఎం కేసీఆర్ ప్రకటన సంతృప్తినిచ్చిందన్నారు. చాన్నాళ్లుగా ఉద్యోగులు తమకు హెల్త్ స్కీమ్ వర్తింపజేయాలంటూ విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారన్నారు. ఈక్రమంలో సీఎం హెల్త్‌స్కీం ప్రకటించడంతో ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా పలుచోట్ల స్వీట్లు పంచిపెట్టారు.

వ్యక్తి పై కేసు

వీర్నపల్లి: వీర్నపల్లి మండలకేంద్రానికి చెందిన మానాల చందు అనే యువకుడు ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవత తెలిపారు. అదే గ్రామానికి చెందిన యువతి చందు వేదిస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగాలు వద్దట..!

- నైపుణ్యాల మెరుగు దిద్దుతున్న టాస్క్
- శిక్షణ వరకే పరిమితమవుతున్న విద్యార్థులు
- ఉద్యోగాల ఇంటర్వ్యూలపై అనాసక్తి
- తల్లిదండ్రులు పంపకపోవడమే ప్రధాన కారణం
- వేతనాలు చాలవని మరికొందరి వెనకంజ
- ప్రభుత్వ తపన వృథా అంటున్న నిపుణులు
- కొలువులతోనే బంగారు భవిత అంటున్న వైనం

'ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ కెమికల్ కంపెనీ విద్యార్థులకు రూ.16వేల జీతంతో ఉద్యోగాలు ప్రకటించగా.. కరీంనగర్‌కు చెందిన విద్యార్థులకు టాస్క్ ప్రతినిధులు, కళాశాలల వారు సమాచారమందించారు. ఇందులో చాలా మంది ఇంటర్వ్యూ లకు హాజరవగా నలుగురు కూడా రిపోర్టు చేయలేదు. డిగ్రీ పూర్తి చేసినవారికి రూ.16 వేల జీతమిచ్చినా ఉద్యోగాల్లో చేరడం లేదు.'

'ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఓ విద్యార్థినికి ఒక కంపెనీల్లో ఉద్యోగం వచ్చింది. ఇంటర్వ్యూకు పంపించిన తల్లిదండ్రులు వివిధ కారణాలు చెప్పి ఉద్యోగానికి పంపించలేదు. దీంతో కంపెనీవారు సదరు ఉద్యోగం వేరే వారికి కేటాయించారు. అయితే ఇన్ని రోజులు స్కిల్స్ నేర్చుకొని ఉద్యోగం సాధించిన విద్యార్థిని ఇంటివద్దే ఉండిపోయింది. ఇలాగే చాలా మంది ఏళ్ల తరబడి శిక్షణ పొంది పలు ఇంటర్వ్యూలకు హాజరవడం లేదు. మరికొందరు ఉద్యోగం వచ్చినా వెళ్లడం లేదు'.



టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుదిద్ది ఉద్యోగాలు సాధించే దిశగా తయారు చేయాలని ప్రభుత్వం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ని రూపొందించింది. ఇందులో భాగంగా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్‌తో పాటు వివిధ కోర్సుల విద్యార్థులను, కళాశాలలను టాస్క్‌లో నమోదు చేయించి ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. నమోదైన ప్రతీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో విడతల వారీగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. కాగా శిక్షణ తీసుకున్న విద్యార్థులు అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను వదులుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రుల అనాసక్తి అని తెలుస్తోంది.

ఉద్యోగాలపై అనాసక్తి...

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 62 కళాశాలలు టాస్క్‌లో నమోదు చేసుకున్నాయి. వీటిలో గతేడాది దాదాపు 2 లక్షల మంది నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 4,300 మంది నమోదు చేసుకున్నారు. టాస్క్ ప్రతినిధులు విడతల వారీగా కమ్యూనికేషనల్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, రెజ్యూమ్ సెట్టింగ్, ప్రజెంటేషన్ స్కిల్స్, అపిటిట్యూడ్, టీం వర్క్, గ్రూప్ డిస్కషన్, ప్రోగ్రామింగ్ టెక్నిక్స్‌తో పాటు విద్యార్థుల కోర్సులను బట్టి అవసరమయ్యే వివిధ రకాల నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. కంపెనీలకు, విద్యార్థులకు అనుసంధానం చేస్తూ కార్పొరేట్ కంపెనీలు కోరుకునే స్కిల్స్‌లో పటిష్టంగా శిక్షణ ఇస్తున్నారు. కానీ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్వ్యూల వరకు వెళ్లడం లేదు. టాస్క్ ప్రతినిధులు, కళాశాలల వారు సమాచారం అందించినా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇందులో ముఖ్యంగా డిగ్రీ విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నట్లు సమాచారం. జీతభత్యాలు లెక్కించి ఏమీ మిగలవని చెప్పి తల్లిదండ్రులే ఇంటి వద్దే ఆపేస్తుండగా, డిగ్రీతోనే లక్షల ప్యాకేజీ ఊహించుకున్న విద్యార్థులు కంపెనీలు అందిస్తున్న అవకాశాలను వదులుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టాస్క్‌లో నమోదైన కళాశాలల వివరాలు

జిల్లా	ఇంజనీరింగ్	డిగ్రీ	డిగ్రీ, పీజీ	డిప్లొమా	మొత్తం
కరీంనగర్	7	11	8	3	29
పెద్దపల్లి	3	4	5	1	13
రాజన్నసిరిసిల్ల	1	3	1	1	6
జగిత్యాల	1	7	5	1	14
మొత్తం	12	25	19	6	62

ఉద్యోగాల్లో చేరితేనే ఉజ్వల భవిష్యత్తు



టాస్క్‌లో నమోదైన విద్యార్థులకు ఎప్పటికప్పుడు శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి ఉద్యోగాలకు కావాల్సిన మెలకువలు నేర్పిస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు ఇంటర్వ్యూలకు దూరం కాగా మరికొందరు ఉద్యోగాల్లో ఎంపికైనా జాయిన్ కావడం లేదు. తల్లిదండ్రులు పంపించకపోవడమూ ఒక కారణమే. డిగ్రీ తర్వాత వేతనాలు మొదట్లో కొన్ని సంస్థల్లో తక్కువగా ఉండి తర్వాత పెరుగుతాయి. ఉద్యోగం చేస్తూ పోతే అనుభవం పెరిగిన కొద్ది వేతనాలు పెంచుతారు. ఉద్యోగం చేస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి. – గంగాప్రసాద్, టాస్క్ రీజనల్ కోఆర్డినేటర్

లక్షల్లో ప్యాకేజీలని ఊహలు

డిగ్రీ, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు కంపెనీలు ప్రస్తుతం ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇందులో భాగంగా కంపెనీలు మొదట్లో తక్కువ వేతనాలు ప్రకటిస్తుండగా, జీతాలు రూ.లక్షల్లో ఊహించుకుంటున్న విద్యార్థులు అటువైపు వెళ్లడంలేదు. పోటీ పడి స్కిల్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంపై ఆసక్తి చూపడం లేదు. తద్వారా రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని విద్యారంగ నిపుణులు భావిస్తున్నారు. యువతరానికి ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా కల్పించాలనే ప్రభుత్వ తపన వృథా అవుతుందని బాధపడుతున్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు వారి పంతా మార్చుకొని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెబుతున్నారు.

ఘనంగా పాటిరాజం జయంతి



విగ్రహానికి పూలమాల వేస్తున్న టెస్కాబ్ చైర్మన్

గంభీరావుపేట: దివంగత మాజీ మంత్రి గంభీరావుపేటకు చెందిన పాటి రాజం జయంతి వేడుకలను బుధవారం మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాటిరాజం విగ్రహానికి టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ ప్రాంతానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణ అధ్యక్షుడు వెంకటియాదవ్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, సెస్‌డైరెక్టర్ నారాయణరావు, ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్, రాజనర్సింహారెడ్డి, అభిలాశ్, సంజీవ్, మల్లేశం, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడికి అవార్డు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు జిందం కమలాకర్‌కు వైద్యో నారాయణ హరి అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో ఆయుర్వేద వైద్యుల జాతీయ 3వ సమావేశం జరిగింది. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఔషధాలు తయారు చేసే విధానం, తాను అందజేసిన వైద్యసేవల గురించి కమలాకర్ వివరించారు. ఆయన ప్రతిభను గుర్తించిన శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ప్రతినిధుల బృందం వైద్యో నారాయణ హరి అవార్డుతో సత్కరించింది.

నేడు, రేపు జిల్లా స్థాయి క్రీడాపోటీలు

సిరిసిల్లఅర్బన్: రాజన్న ప్రీమియర్ లీగ్ 2023 జిల్లా స్థాయి క్రీడాపోటీలను సిరిసిల్ల పట్టణం రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో గురువారం, శుక్రవారం నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో ఉపేందర్‌రావు ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు పైబడి, మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఉదయం 9 గంటలలోపు హాజరుకావాలని సూచించారు.

దొంగలు బాబోయ్ దొంగలు

- జంకుతున్న జనం
- ఆలయాలే టార్గెట్
- రెండు రోజుల్లో నాలుగు ఆలయాల్లో చోరీలు
- నగదు... నగలు దోచుకెళ్తున్న వైనం



ఆలయంలో చోరీపై విచారిస్తున్న పోలీసులు

వేములవాడ: ఆలయాలనే టార్గెట్ చేస్తూ దొంగలు రెచ్చిపోతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ఏకంగా నాలుగు ఆలయాల్లో చొరబడి నగదు, నగలు దోచుకెళ్లారు. వేములవాడ ప్రాంతంలోని రుద్రవరం ఎల్లమ్మ గుడి, పెద్దమ్మ ఆలయం, అనుపురం రామాలయం, ఆరెపల్లి హనుమాన్ టెంపుల్, కొదురుపాక ఎల్లమ్మ గుడి అలాగే రెండు రోజుల క్రితం ముస్తాబాద్ అయ్యప్పస్వామి, చీకోడు లక్ష్మీనర్సింహాస్వామి ఆలయాల్లో చోరీలు జరిగాయి. ఇందులో స్వామివారి హుండీలు, ఆభరణాలు దోచుకెళ్లారు. ఇదేం కాలమో దొంగలు ఆలయాలను కూడా వదలడం లేదంటూ జనం వాపోతున్నారు.

జంకుతున్న జనం

దొంగలు రెచ్చిపోయి ఆలయాల్లో చోరీలకు పాల్పడుతుండడంతో ఆయా గ్రామాల్లోని జనం, భక్తులు, అర్చకులు జంకుతున్నారు. పోలీసుల గస్తీ బృందాలు, 100 డయల్ సమాచారం, బ్లూకోల్ట్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నప్పటికీ చోరీలు ఆగడం లేదంటూ జనం భయపడిపోతున్నారు. కేవలం ఆలయాల్లో కాకుండా తాళాలు వేసిన ఇళ్లలోనూ చొరబడి అందినంత దండుకుంటున్నారని గ్రామీణ ప్రజలు పేర్కొంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ఇటీవల జరిగిన చోరీలను సీసీ ఫుటేజీల్లో పరిశీలిస్తున్నాం. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. పోలీసు బృందాలు తిరుగుతున్నాయి. ఆలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లోకి అపరిచితులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. 100కు డయల్ చేయాలి. యువతరం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి.
– నాగేంద్రాచారి, వేములవాడ డీఎస్పీ

నాగలి పట్టిన చేతులతో డాక్టరేట్

- తెలంగాణ ఉద్యమంలో సాహితీ సాంస్కృతిక సంస్థల పాత్రపై పరిశోధన
- ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్న కిష్టయ్య



పరిశోధన గ్రంథాన్ని అందుకుంటున్న అందె కిష్టయ్య

గంభీరావుపేట(సిరిసిల్ల): నాగలి పట్టిన చేతులతో పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. వ్యవసాయ కుటుంబంలో పుట్టి.. డాక్టరేట్ పట్టా సాధించాడు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన అందె కిష్టయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలంగాణ ఉద్యమంలో సాహితీ సాంస్కృతిక సంస్థల పాత్ర' 1969–2010 వరకు ఒక పరిశీలన అనే అంశాలపై పరిశోధన చేశాడు. దీనిపై పుస్తకాన్ని ముద్రించడంతోపాటు పాటను రూపొందించాడు. కిష్టయ్య చేసిన పరిశోధనకు యూనివర్సిటీ పీహెచ్‌డీ పురస్కారాన్ని అందించింది. కిష్టయ్య రాచర్లగొల్లపల్లిలో పదోతరగతి వరకు చదివాడు. సిరిసిల్లలో ఇంటర్మీడియెట్ చదివాడు. కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో ఐదేళ్లు వ్యవసాయ పనులు చేశాడు. చదువు మీద మక్కువతో సప్లిమెంటరీ పరీక్షలు రాసి పాసయ్యాడు. సిద్దిపేటలో డిగ్రీ పూర్తి చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కాలేజీలో అడుగుపెట్టి పోస్టు తెలుగులో పోస్టుగాడ్యుయేషన్, బీఎడ్ చదివాడు. యూనివర్సిటీ నిర్వహించిన పీహెచ్‌డీ ఎంట్రన్స్ పరీక్షలో అర్హత సాధించాడు. ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి కంటిమీద కునుకులేకుండా చదివి పీహెచ్‌డీ పట్టా సాధించిన కిష్టయ్యను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- నెల రోజుల క్రితమే ప్రేమపెళ్లి
- మృతిపై అనుమానాలు



సాగర్ల గణేశ్(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ యువకున్ని నెల రోజులకే రోడ్డు ప్రమాదరూపంలో మృత్యువు వెంటాడింది. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన సాగర్ల గంగయ్య–లక్ష్మి దంపతులకు ఒకే ఒక్క కుమారుడు గణేశ్(26). గణేశ్ అదే గ్రామానికి చెందిన రమ్య అనే యువతిని నెల రోజుల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజులుగా సిరిసిల్లలో ఉంటున్నాడు. బుధవారం నిజామాబాద్‌లో జరిగిన ఓ వేడుకకు హాజరై రాత్రి ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో మల్కపేటలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే గణేశ్ మృతిపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. కోనరావుపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పైనుంచి పడి రైతు..



లచ్చిరెడ్డి(ఫైల్)

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన రైతు మారు లచ్చిరెడ్డి(65) చింతచెట్టుపై నుంచి కింద పడి బుధవారం రాత్రి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. వ్యవసాయ పొలం వద్ద ఉన్న చింతచెట్టు ఎక్కుతుండగా కాలుజారి కిందపడ్డాడు. స్పృహ కోల్పోయిన లచ్చిరెడ్డిని వెంటనే వేములవాడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించారు. వైద్యం అందిస్తుండగానే లచ్చిరెడ్డి మృతిచెందాడు. మృతునికి భార్య నిర్మల ఉన్నారు.

యువతను విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువతకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్ అన్నారు. కోట్లాది మంది యువతి, యువకులు డిగ్రీ పట్టాలు చేతబట్టుకుని ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్నారని, అలాంటి వారికి బడ్జెట్‌లో ఎలాంటి ఉద్యోగాలు కల్పిస్తారో చెప్పలేదన్నారు. దీంతో చదువు పూర్తిచేకున్న వారంతా రోడ్లవెంట తిరుగుతున్నారని నిరుద్యోగం వైపు యువత వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, కోటి ఉద్యోగాల మాటను పూర్తిగా మరచిపోయారన్నారు. గ్రామాల్లో పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధిహమీ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలకు యువత తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.

ఇద్దరి అరెస్టు

వేములవాడ: వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరిని బుధవారం రాత్రి అరెస్టు చేసినట్లు వేములవాడ పట్టణ సీఐ వెంకటేశ్ తెలిపారు. సీఐ వెంకటేశ్ కథనం ప్రకారం. వేములవాడలోని బద్దిపోచమ్మవీదిలోని సోయినేని హన్మండ్లు(62) కూతురు పెళ్లి పనుల్లో ఉండగా వీధిలో అడ్డంగా ఉన్న మట్టిని తొలగించాడు. ఈక్రమంలో ఇంటి సమీపంలోని ఆకుల నాగరాజు, ఆకుల శంకరయ్యలతో గొడవ జరిగింది. ఈ గొడవలో హన్మండ్లును ఆకుల నాగరాజు, ఆకుల శంకరయ్య దాడి చేయగా మృతి చెందాడని.. మృతుడి భార్య సరోజన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, నిందితులు నాగరాజు, శంకరయ్యను రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు.

కారు ధ్వంసం

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, సర్పంచ్ యామ సుమతి కుమారుడు యామ తిరుపతి కారు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి పగులగొట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కావాలనే తనపై కక్షతో ఇలా చేసి ఉంటారని ఫిర్యాదుచేశారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



కోనరావుపేటలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐవో

కోనరావుపేట(వేములవాడ): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి మహేశ్ సూచించారు. కోనరావుపేట పీహెచ్‌సీని బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలోని వ్యాక్సినేషన్ రికార్డులు, గర్భిణుల వివరాల నమోదు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్యసేవలందించాలన్నారు. మండల వైద్యాధికారి వేణుమాధవ్, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఫార్మసిస్ట్ శ్రీధర్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో 'శ్రీచైతన్య' సత్తా



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మూడో, ఐదోసెమిస్టర్ ఫలితాల్లో శ్రీ చైతన్య డిగ్రీ విద్యార్థులు సత్తా చాటారు. బీఎస్సీ విభాగంలో ఎం.ప్రణయ 9.2, సయ్యద్ సారా 9.2, ఎల్.అఖిల 9.1, ఎస్.పవిత్ర 9.1, కే.సాత్విక 9.1, వి.అంజలి 9.0, బిందు శ్రీ 9.0, వై.దీపిక 9.0, ఏ.రశ్మిత 9.0.. బీకాం, మేనేజ్మెంట్ విభాగంలో బి.రాహుల్ 9.2, కే.సౌమ్య 9.1, బిందు శ్రీ 9.0 జీపీఏ సాధించారని, చాలామంది విద్యార్థులు 8.5 జీపీఏకు పైగా సాధించి యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అన్నారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్.ఎల్.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

డిగ్రీ ఫలితాల్లో వాణినికేతన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ దీపిక

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో వాణినికేతన్ డిగ్రీ,పీజీ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబర్చినట్లు శాతవాహన ఈసీ మెంబర్, కళాశాల కరస్పాండెంట్ ఐ.దీపిక తెలిపారు. టి.నవ్య 9.08, సుహానా 8.78, డి.శ్రావణి 8.68, డి.సౌమ్య మిశ్రా 8.6, జె.దర్శిని8.57, కామర్స్ విభాగంలో కే.పూజిత 8.65, ఎం.శ్రావణి 8.63, ఏ.ఉమాదేవి 8.52, ఆర్ట్స్ విభాగంలో నందుకుమార్ 8.5 జీపీఏ సాధించారు. ఎం.వైష్ణవి 9.14 ,టి.శిల్ప 8.89, ఈ.అర్చన 8.7, ఏ.హర్షిని 8.44, ఎం.మెహసిన్ అహ్మద్ 8.34, అభిలాష్ 8.27, ఐ.అనూష 8.13,ఆర్ట్స్ విభాగంలో కె.మౌనవ్య 9.58, డి.శ్రీవర్ష 8.86, ఈ.శివాని 8.2 ఎస్‌జీపీఏ సాధించారు. 146 మంది 8.0ఆపైన అధిక ఎస్‌జీపీఏలు యూనివర్సిటీస్థాయిలో సాధించారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బుధవారం కళాశాల కరస్పాండెంట్ ఐ.దీపిక, ప్రిన్సిపల్ డి.వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు.

కరాటే పోటీల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

- 28మందికి గోల్డ్‌మెడల్, చాంపియన్‌షిప్ అవార్డు



గోల్డ్ మెడల్స్‌తో కేజీబీవీ విద్యార్థినులు

గంభీరావుపేట(సిరిసిల్ల): జాతీయస్థాయి కరాటే పోటీల్లో గంభీరావుపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు 28 మంది గోల్డ్‌మెడల్, చాంపియన్‌షిప్ అవార్డు సాధించారు. రెండు రోజుల క్రితం కరీంనగర్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థినులను టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు బుధవారం అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి వసంత, సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణాధ్యక్షుడు వెంకటియాదవ్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, ఎగదండి స్వామి, రాజనర్సింహారెడ్డి, పిట్ల శ్రీమతి, బాబు, శేఖర్‌గౌడ్, పల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.